క్లుప్తంగా

9 మంది జూదరుల అరెస్టు

● రూ.54,860 నగదు స్వాధీనం

దొనకొండ: పేకాట స్థావరాలపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసిన సంఘటన మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలో సోమవారం జరిగింది. త్రిపురాంతకం సీఐ డీ హుస్సేన్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఆరవల్లిపాడు గ్రామ శివారులో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.54,860 నగదుతో పాటు 4 ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు న మోదు చేసి దర్శి జూనియర్ సివిల్ జడ్జిముందు హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

వీధి కుక్కలు పట్టివేత



కుక్కలను బంధించి తీసుకెళ్తున్న దృశ్యం

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లవారి పాలెం గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ చిమట సుబ్బారావు దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఆయన స్పందించి కుక్కలు పట్టేవాళ్లకు సమాచారం అందించారు. సోమవారం కుక్కలు పట్టే వాళ్లు వచ్చి గ్రామంలోని వీధి కుక్కలను పట్టి వ్యానులో బంధించి సుదూర ప్రాంతాల్లో వదిలిపెట్టారు.

రాయితీపై పశువుల దాణా



పశువైద్యశాలలో సిద్ధంగా ఉన్న పశువుల దాణా

ముండ్లమూరు (కురిచేడు): పశువులకు రాయితీపై దాణా సరఫరా చేసేందుకు స్థానిక పశువైద్యశాలలో సిద్ధంగా ఉన్నట్లు పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక పశువైద్యశాలకు 6,500 కిలోల పశువుల దాణా వచ్చినట్లు చెప్పారు. 50 కిలోల బ్యాగు ఎమ్మార్పీ ధర రూ.1,110 కాగా, రాయితీపై రూ.555కు ఇస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన పశుపోషకులు స్థానిక పశువైద్యశాలకు వచ్చి రాయితీ పోను మిగతా నగదు చెల్లించి దాణా తీసుకెళ్లాలని ఆమె కోరారు.

సకాలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



వీఆర్వోలు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని ప్రజల వద్ద నుంచి రెవెన్యూపరంగా వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి రెవెన్యూ పరిధిలోని రైతుల నుంచి వచ్చిన అర్జీలలో సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీలలో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను వారి వద్ద నుంచి తీసుకున్నారు. వీఆర్వోలు ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఎంఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరి రావు, జూనియర్ అసిస్టెంటు వాటుపల్లి కృష్ణప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎండ మండే..!

● నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
● ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బ ప్రభావం
● జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



జనాలు లేక నిర్మానుష్యంగా మారిన శ్రీశైలం రహదారి

పెద్దదోర్నాల: మండుతున్న ఎండలకు జన జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై జనసంచారం లేక కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే సూర్యుడు నిప్పులుగక్కుతున్నాడు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలివీ..

వేసవి ఎండ తాకిడికి మన శరీరంలో మెదడు, చర్మంలో ఉన్న ఉష్ణోగ్రతల నియంత్రణ వ్యవస్థ తాత్కాలికంగా దెబ్బ తింటుందని పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. వడదెబ్బ లక్షణాలను ఆమె వివరించారు.

- వడదెబ్బ తగిలినప్పుడు విపరీతమైన దప్పిక, శరీరం వేడెక్కిపోవడం, తలనొప్పి, కళ్లు తిరగడం, ఒళ్లు తూలడం, వాంతులు, చూపు మందగించడం, కండరాల నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తాయి.
- బాధితుల్లో చర్మం వేడెక్కి పొడిబారుతుంది. రక్తపోటు, బీపీ సాధారణ స్థాయి కంటే తగ్గుతుంది.
- జ్వరం తీవ్రత 104 ఫారెన్ హీట్ నుంచి 107ల మధ్య ఉంటుంది. పై లక్షణాలు కనిపించిన వెంటనే ప్రథమ చికిత్స అందించాలి. లేదంటే ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు ఇవీ..

వడదెబ్బ సోకిన వారిని వైద్యశాలలో చేర్పించేలోపు చల్లని ప్రదేశంలోకి చేర్పించాలి. గాలి బాగా తగిలేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దుస్తులను వదులు చేయాలి, చల్లని నీటితో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి. అరచేతులు, పాదాలను రుద్ది రక్త ప్రసరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

> **వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి**
> అత్యవసర సమయాల్లో కనీస జాగ్రత్తలతో మాత్రమే బయటకు రావాలి. విధులకు వెళ్లేటప్పుడు కార్మికులు, కూలీలు తప్పకుండా తాగునీటిని వెంట ఉంచుకోవాలి. రోజుకు నాలుగు నుంచి ఆరు లీటర్ల నీళ్లు తాగాలి. వేసవిలో ప్రయాణించేటప్పుడు తెల్లని వదులు దుస్తులు ధరించాలి. తలకు గుడ్డ చుట్టుకోవాలి, మజ్జిగ, పెరుగుతో భోజనం తీసుకోవాలి. మసాలాలు, నూనె పదార్థాలు తగ్గించాలి. ఎక్కువగా పండ్ల రసాలు తీసుకోవాలి. మజ్జిగ, కొబ్బరినీరు, నిమ్మరసం, తాజా పండ్లరసాలు. చెక్కెర కలిపిన నీరు తీసుకోవాలి. కాఫీ, టీ తగ్గించాలి. చెమటలు పట్టి కళ్లు తిరుగుతున్నట్లు అనిపిస్తే ఒక లీటరు మంచినీటిలో నాలుగు చెంచాల చెక్కర, అర చెంచా ఉప్పు కలిపిన ద్రావణాన్ని వెంట వెంటనే తాగాలి.
> – డాక్టర్ లావణ్య, ప్రభుత్వ వైద్యాధికారి, పెద్దదోర్నాల

ఆటో ప్రమాద బాధితులకు బూచేపల్లి ఆర్థికసాయం



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి (కురిచేడు): గత నెలలో ఉల్లగల్లు వద్ద ఆటో ప్రమాదంలో గాయపడి నరసరావుపేటలో చికిత్స పొంది వచ్చిన బాధితులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఒక్కొక్క బాధితుడికి రూ.10 వేల చొప్పున వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా అందించారు. లంకోజనపల్లి గ్రామంలోని బాధితుల గృహాలకు వెళ్లి పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు.. బూచేపల్లి వారు పంపిన ఆర్థికసాయాన్ని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, మున్సిపాలిటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మెత అంజిరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, వైస్ ఎంపీపీ కొరివి మునలయ్య యాదవ్, గ్రామ సర్పంచ్ కొరివి కోటయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేసేదెప్పుడు

● జిల్లా యాక్టివిటీ సెక్రటరీ డి.వెంకటేశ్వర్లు

పుల్లలచెరువు: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని జిల్లా యాక్టివిటీ సెక్రటరీ డి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని, రైతులకు పెట్టుబడిసాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఈ ఏడాదైనా ఇస్తారా అన్ని అనుమానం వ్యక్తమవుతోందన్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ రెండో వారంలో పాఠశాలలను తెరుస్తారని, ఈ ఏడాదైనా తల్లికి వందనం పథకం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పథకాలు, హామీల పేరుతో ప్రజలను కూటమి నాయకులు మోసం చేశారన్నారు. పథకాల డబ్బులు వస్తాయని పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముందుగా చెప్పిన ప్రకారం పథకాల డబ్బులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమచేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చి హామీలను నెలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెవెన్యూ లీలలపై విమర్శలు



ఇది ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ, వీఆర్వో

కురిచేడు: మండల కేంద్రంలో రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది లీలలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతూ విమర్శిస్తున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన 246/2ఏలో 0.02 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని ఎవరూ ఆక్రమించరాదు.. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ తహసీల్దార్ ఆదేశంతో ఆర్ఐ నాగరాజు, వీఆర్వో నాగరాజు సోమవారం హెచ్చరికలు చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే, ఈ విషయం ప్రజలు ముక్కున వేలేసుకునేలా ఉంది. ఆ సర్వే నంబర్‌కు సంబంధించి అసలు రికార్డు లేదని సమాచార హక్కు చట్టం ద్వారా సమాధానమిచ్చిన అధికారులకు ఇప్పుడు రెండు సెంట్లు ఎలా కనిపించిందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ సర్వే నంబరులో మొత్తం విస్తీర్ణం ఎంత ఉంది, దానిని ఎవరెవరికి ఎంతెంత ఇచ్చారు, ప్రభుత్వ భవనాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి.? గతంలో ఆర్టీసీకి ఇచ్చిన భూమి వివరాలేమిటనే విషయాలను కప్పిపుచ్చి కేవలం రెండు సెంట్లు మాత్రమే చూపడం రెవెన్యూ లీలలకు అద్దం పడుతోంది. ఉన్నతాధికారులు, ప్రజలు, చట్టాన్ని పక్కదోవ పట్టించేందుకే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

గంగమ్మతల్లి నెల పొంగళ్లకు బూచేపల్లి హాజరు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు: గుంటిగంగమ్మ జాతర అనంతరం వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఏర్పాటు చేసిన గంగమ్మ తల్లికి నెల పొంగళ్ల కార్యక్రమంలో సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. వారిని స్థానిక నాయకులు శాలువాలు, గజమాలతో సత్కరించారు. అనంతరం సత్రాల్లో ఉండే పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచులు కోట శివలక్ష్మి, రామిరెడ్డి, చిమట సుబ్బారావు, షేక్ వలి, ఉప సర్పంచులు ప్రసాద్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఆదాం షరీఫ్ (బుజ్జి), గంగమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పూనూరి దేవదానం, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జక్కుల రామకృష్ణ, ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్‌రెడ్డి, అడ్వకేట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి, గోపు శ్రీనివాసరెడ్డి, జిల్లా మైనారిటీ విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ లతీఫ్, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి (గోల్డ్), గుజ్జుల యోగిరెడ్డి, గూడా గోపాల్‌రెడ్డి, కైపు అశోక్‌రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, కుమ్మిత జయరామి, అనిల్ రెడ్డి, గుజ్జుల తిరుపతిరెడ్డి, గుజ్జుల మోహన్‌రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, షేక్ వలి, వేమర్తి ప్రభుదాస్, సంగు కొండారెడ్డి, సయ్యద్ సైదా, కోటా కృష్ణారెడ్డి, పులి రమణారెడ్డి, బాలనాగిరెడ్డి, కోటా కృష్ణారెడ్డి, హరిబాబు, బ్రహ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పూనూరి నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

కురిచేడు: స్థానిక చిన రామాలయం ప్రాంతంలో కీర్తి మెడికల్ షాపు యజమాని పాశం లక్ష్మణరెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం ప్రారంబించారు. ఎండలు మండుతున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చిన వారి దాహార్తి తీర్చేందుకు ముందుకొచ్చిన దాత లక్ష్మణరెడ్డిని వైద్యాధికారి అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, గ్రామస్తులు కే రమేష్, ఇందూరి వెంకటరెడ్డి, తిగుల్ల కొండారెడ్డి, పెనుగొండ నారాయణరెడ్డి, పీ నాసరయ్య, గుంటక సుబ్బారెడ్డి, కోవెలకుంట్ల వెంకటేశ్వర్లు, దూలం వెంకటరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



డీటీ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

దర్శి (కురిచేడు): ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దర్శిలోని గడియారస్తంభం సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి, దర్శి జోన్ కన్వీనర్ ఏఎల్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు ఎంఎల్ మంజుల, సీహెచ్ కోటేశ్వరమ్మ, మండల శాఖ బాధ్యులు జీ రంగస్వామి, తిప్పిశెట్టి శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యుడు షేక్ మస్తాన్‌వలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో చెంచులు



పనులను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉండేందుకు చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో చెంచులు ముమ్మరంగా నిమగ్నమయ్యారు. చెంచుల కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ కింద గుర్తించిన యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల మండలాల్లో ఉన్న 61 గూడాల్లో మొత్తం 2,829 జాబ్ కార్డులు ఉన్నాయని, ప్రస్తుతం 1,761 మంది ఉపాధి పనులు చేస్తున్నారని ఆ ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. మిరప కోతల కోసం పల్నాడు జిల్లాకు వెళ్లిన చెంచులు రావాల్సి ఉందని, దాచేపల్లికి వెళ్లి వారిలో అవగాహన కల్పించామన్నారు. ఒక్కొక్క కూలీకి సరాసరిన రూ.250 వరకు జమవుతున్నాయని చెప్పారు. ఉదయాన్నే పనికి వచ్చి ఎక్కువసేపు నిర్ణయించిన పనులు చేస్తే ఎక్కువ కూలీ లభిస్తుందని, ఆర్‌వోఎఫ్ఆర్ భూములు ఉన్న చెంచులు 150 రోజులు తగ్గకుండా పనులు చేయాలని, మిగిలినవారు 100 రోజులు పనిదినాలు తగ్గకుండా ఉండేలా వారిలో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పనిచేసే స్థలంలో మంచి నీరు, ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.



పెద్దారవీడు చెరువుకట్టపై మార్జిన్ లేని రోడ్డు



చెరువుకట్ట మూలమలుపు వద్ద కోతకు గురైన రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో చెరువు కట్ట వద్ద రోడ్డు ప్రమాదభరితంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు వర్షానికి కోతకు గురయ్యాయి. మార్జిన్లు కనిపించకుండా రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో మూసుకొని ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకోవాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు అదుపుతప్పితే చెరువు కట్ట రోడ్డుకు ఇరువైపులా దాదాపు 15 అడుగుల లోతులో పడిపోయే ప్రమాదం ఉంది. రోడ్డు మార్జిన్లు దిగేటప్పుడు వాహనాలు చెరువుకు ఇరువైపులా కిందపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ రహదారిపై లారీలు, ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు, ఆటోలు, కార్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. కర్నూలు, శ్రీశైలం, ఒంగోలు, కడప, తిరుపతి, తదితర ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు రద్దీగా తిరుగుతుంటాయి. సమస్య ఏళ్ల తరబడి ఉన్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని, తారురోడ్డును వెడల్పు చేసి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.